
కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న అప్పటి రెవెన్యూ అధికారులు (ఫైల్)

బ్రిడ్జిపై భయం.. భయం..!

నూతన బ్రిడ్జి నిర్మించడంలో నిర్లక్ష్యం

నిధులు మంజూరైనా సాగని పనులు

ప్రమాదపు అంచున ప్రయాణం

వామ్మో.. ఈ బ్రిడ్జి చూస్తేనే భయమేస్తోంది. పిల్లర్ పూర్తిగా కట్ అయింది. బ్రిడ్జి కూడా ఒరిగిపోయింది. ఏ క్షణంలోనైనా కూలిపో వచ్చనిపిస్తుంది. అలాంటి బ్రిడ్జిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. టన్నులకొద్దీ బరువు ఉండే ఇసుక టిప్పర్లు సైతం వెళ్తున్నాయి. మూడేళ్లకుపైగా ఇలా భయం.. భయంగానే రాకపోకలు సాగిస్తున్నారు. గత వైసీపీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎట్టకేలకు గతేడాది నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా.. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. బిల్లులు రావన్న భయంతోనే ఆసక్తి చూపలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. వెరసి.. ప్రమాదపు అంచున ప్రయాణం సాగించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.


కుంగిన బ్రిడ్జిపై ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్

ముదిగుబ్బ, సెప్టెంబరు 10: మండలంలోని గంగిరెడ్డిపల్లి, కొడవండ్లపల్లి మధ్య మద్దిలేరు వాగుపై వంతెన ప్రమాదకరంగా ఉంది. ఒక పిల్లర్ కట్ అవడంతో బ్రిడ్జి కూడా ఒరిగిపోయింది. ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉంది. నూతన బ్రిడ్జి నిర్మాణంలో గత వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. రెండేళ్లపాటు పట్టించుకున్న పాపాన పోలేదు. ఏడాది క్రితం టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టరు పనులు చేపట్టలేదు. 2021లో నివార్ తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు మద్దిలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో గంగిరెడ్డిపల్లి, కొడవండ్లపల్లి మధ్య వాగుపై నిర్మించిన బ్రిడ్జి కూలిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత రాళ్లు, మట్టి వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆ బ్రిడ్జిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. నూతన వంతెన నిర్మించేందుకు 2023 జూలైలో రూ.2.97కోట్ల నిధులు మంజూరయ్యాయి. అనంతపురానికి చెందిన కాంట్రాక్టర్ రూ.2.20 కోట్లకు టెండరు దక్కించుకున్నాడు. ఆరు నెలల్లోగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. కాంట్రాక్టర్ ఆసక్తి చూపలేదు. దీంతో గడువు ముగిసింది. తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో రీటెండర్ నిర్వహించలేదు. కోడ్ ముగిసిన తర్వాత కూడా ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. దీంతో వర్షం వచ్చిన ప్రతిసారీ మట్టి కోసుకుపోయి వంతెన బలహీనపడుతోంది. బూదనాంపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్‌పాయింట్ నుంచి రోజూ 50 నుంచి 70 ఇసుక టిప్పర్లు అధిక బరువుతో విరిగిన వంతెనపై ప్రయాణిస్తున్నాయి. దీంతో వంతెన మరింత ప్రమాదకరంగా మారింది.

విరిగిన పిల్లర్.. కుంగిన వంతెన..


ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి కింది భాగం

నూతన బ్రిడ్జి నిర్మించాలి

మద్దిలేరు వాగుపై వంతెన కూలిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- జనగాని మధు, గంగిరెడ్డిపల్లి, ముదిగుబ్బ మండలం

రాళ్లువేసి పూడ్చారు

నివార్ తుఫాన్ వర్షాలకు బ్రిడ్జి కూలిపోయింది. మట్టి, రాళ్లువేసి మరమ్మతులు చేశారు. ఈ బ్రిడ్జిపై 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు మేల్కొని, నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

- నరేంద్ర, కొడవండ్లపల్లి, ముదిగుబ్బ మండలం

బ్రిడ్జి నిర్మాణం చేపడతాం

మద్దిలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే చేపడతాం. అప్పటి వరకు ఇసుక అధిక లోడుతో వాహనాలు బ్రిడ్జిపై వెళ్లకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- వన్నూరుస్వామి, ఏఈఈ, రోడ్లు, భవనాల శాఖ

వరద బాధితులకు అమృత కలశం

సత్యసాయి ట్రస్టు సాయం

నిత్యావసరాల కిట్ల పంపిణీకి చర్యలు


పంపిణీ చేయనున్న నిత్యావసరాల లిస్టును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తున్న సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్టు సాయం చేస్తోంది. అమృత కలశం పేరుతో బియ్యం, చక్కెర, వంటనూనె, చింతపండు తదితర 20 రకాల నిత్యావసరా లతో కూడిన కిట్లను పంపిణీ చేయనుంది. ఏడు వేల కిట్లను వరద బాధితులకు అందజేయనుంది. కిట్లతో కూడిన వ్యాన్ పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం నుంచి బయల్దేరింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు.. కిట్ల వ్యాన్‌ను ప్రారంభించారు. విజయవాడను వరద ముంచెత్తిన తొలిరోజు నుంచే సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. సత్యసాయి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షు డు సురేంద్రసాయి, రాష్ట్ర సేవాసమన్వయకర్త శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో మంచినీరు, పాలు, బ్రెడ్, బిస్కెట్లు, అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులను వరద బాధితులకు అందజేశారు. ట్రస్టు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సత్యసాయి ట్రస్టు సేవలను వివరించారు. ముఖ్యమంత్రి కొనియాడారని సేవాదళ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెలిపారు.

నిర్జల్ జీవన్..!

అటకెక్కిన జల్‌జీవన్ మిషన్

నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకు


నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకు

- బోరు ఉంటే.. నీరుండదు..
- నీరు, బోరు ఉంటే పైపులైన్ ఉండదు..
- రూ.300కోట్ల పథకాన్ని నీరుగార్చిన గత వైసీపీ ప్రభుత్వం
- గ్రామాలకు తప్పని నీటి కష్టాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 10: జిల్లాలో గ్రామాల్లో ఇంటింటికీ కొళాయిల ద్వారా శుద్ధ జలాన్ని ఇవ్వాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంజల్‌జీవన్ మిషన్‌ను ప్రవేశపెట్టింది. జిల్లాలోని 467 గ్రామ పంచాయతీల పరిధిలో 18.40 లక్షల జనాభాకు కొళాయిల ద్వారా పరిశుభ్రమైన నీటిని అందించడం ఈ పథకం ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లను మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని నీరుగార్చింది. పథకాన్ని అటకెక్కించింది. రూ.కోట్లు ఖర్చయ్యాయి తప్ప.. ఫలితం మాత్రం దక్కలేదు. నీటి కోసం బోరు వేసిన చోట విద్యుత్ సరఫరా ఉండదు. నీరున్నచోట బోరు వేయరు. ఈ రెండూ ఉన్న చోట పైపులైన్ వేయరు. ఇదీ జిల్లాలో పథకం అమలు తీరు. అధికారుల లెక్కల్లో మాత్రం ఇప్పటివరకు 520 పనులను పూర్తి చేశామని చెబుతున్నారు. వాస్తవానికి అత్యధిక శాతం కొళాయిల్లో నీరు రావడం లేదు. ఈ పథకం అమలులో అక్రమాలు జరిగాయని ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

జల్ జీవన్ మిషన్ వివరాలివీ..

జిల్లాలో జల్‌జీవన్ మిషన్ కింద 3 వేలకుపైగా పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. వాటి కోసం రూ.300 కోట్ల వరకు కేటాయించారు. వాటిలో 30 శాతం పనులు కూడా పూర్తికాలేదని తెలుస్తోంది. అధికారుల రికార్డులే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సగం పనులు మొదలే కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పథకం కింద చాలా వరకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించినా వాటికి పైపులైన్లు అమర్చలేదు. తాగునీటి కోసం బోర్లు వేసినా వాటికి పైపులైన్లు వేయలేదు. కొళాయిలు ఇంటింటికీ అందించినా నీటి సరఫరాకు చర్యలు తీసుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. జల్‌జీవన్ మిషన్ పూర్తిస్థాయిలో పనిచేస్తున్న గ్రామాలు చాలా తక్కువ. అధికారుల లెక్కల్లో మాత్రం 90శాతానికిపైగా ఇంటింటికీ కొళాయిలు అమర్చి నీరు సరఫరా చేస్తున్నట్లు నమోదు చేశారు. తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ అందిస్తామని చెప్పింది. తీరా క్షేత్ర స్థాయిలో ఆ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదు. నిధులను పక్కదారి పట్టించి, పథకాన్ని అటకెక్కించారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య తీరకగొంతెండుతోంది.

జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పనుల అమలు తీరిదీ..

నియోజకవర్గం	మంజూరైన పనులు	మంజూరైన నిధులు	పూర్తయిన పనులు	సాగుతున్న పనులు	మొదలు కానివి
పెనుకొండ	504	రూ.77కోట్లు	155	112	237
హిందూపురం	270	రూ.13కోట్లు	43	65	162
మడకశిర	473	రూ.45 కోట్లు	104	123	246
పుట్టపర్తి	434	రూ.29 కోట్లు	249	97	88
కదిరి	893	రూ.36కోట్లు	325	85	423
ధర్మవరం	409	రూ.43కోట్లు	80	10	319
రాప్తాడు	239	రూ.55కోట్లు	41	28	154

అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం

ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జల్‌జీవన్ మిషన్ పనులను ప్రారంభిస్తాం. ఇప్పటి వరకు పూర్తయిన వాటి నిర్వహణ బాధ్యతలను ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అక్కడక్కడ పనులు కూడా కొనసాగుతున్నాయి.

- రషీద్‌ఖాన్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

జిల్లాలో అపరిశుభ్ర మరుగుదొడ్లు లేవు

కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, సెప్టెంబరు 10: జిల్లాలో ఎక్కడా అపరిశుభ్రమైన మరుగుదొడ్లు లేవని కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పాకీ పనివృత్తిగా చేసుకుని జీవించే వారు జిల్లాలో లేరనీ, మనుషులతో ఎత్తి వేయబడే అపరిశుభ్ర మరుగుదొడ్లు లేవని సర్వే ద్వారా నిర్ధారించినట్లు కలెక్టర్ ప్రకటనలో వెల్లడించారు.



అర్ధనగ్న నిరసన

పుట్టపర్తి, సెప్టెంబరు 10: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలంటూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు ఆరోరోజు మంగళవారం స్థానిక హనుమాన్ సర్కిల్‌లో అర్ధనగ్న నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఆరు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సీఐటీయూ నాయకులు గంగాధర్, రమేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మధు మురళి తిమ్మారెడ్డి, చంద్ర, ప్రభు పాల్గొన్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి


ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులు


తీవ్రంగా గాయపడిన క్రాంతికుమార్, సాయికుమార్

వినాయకుడి ప్రతిమను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా

16 మందికి గాయాలు


ప్రమాదంపై ఆరాతీస్తున్న రూరల్ ఎస్ఐ నరేంద్ర

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 10: మండలంలోని గొట్లూరు గ్రామ పరిధిలో మంగళవారం సాయంత్రం వినాయక నిమజ్జనంలో అపశ్రుతి తలెత్తింది. గ్రామానికి చెందిన యువకులు.. వినాయకుడి ప్రతిమను ట్రాక్టర్‌లో నిమజ్జనానికి తరలిస్తుండగా.. తుమ్మల క్రాస్ వద్ద బోల్తాపడింది. 16 మంది యువకులు గాయపడ్డారు. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొట్లూరులో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పూజలు చేశారు. మంగళవారం తుమ్మల గ్రామ సమీపంలోని సంగమేశ్వరం వద్ద చిత్రావతి నదిలో వినాయక నిమజ్జనానికి ట్రాక్టర్‌లో బయల్దేరారు. తుమ్మల క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తాపడడంతో నరసింహులు, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణస్వామి, సాయికుమార్, క్రాంతికుమార్, శివయ్య, భార్గవ్, ఇంద్రసేనగౌడ్, శివయ్య, మోహన్ ప్రతాప్, మారుతి, మనోహన్, నవీన్, భానుప్రకాష్, పవన్‌కుమార్, నాగరాజు గాయపడ్డారు.

వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నరసింహులు, సాయికుమార్, క్రాంతికుమార్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం తీసుకెళ్లారు. రూరల్ ఎస్ఐ నరేంద్ర ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

లడ్డూ వేలంలో తగాదా

- పార్టీ కండువాలతో వచ్చినందుకు ప్రశ్నించిన వైసీపీ నాయకుడు
- మరోసారి గొడవ
- పలువురికి గాయాలు

హిందూపురం, సెప్టెంబరు 10: పట్టణ పరిధిలోని కొల్లకుంట గ్రామంలో వినాయక లడ్డూవేలం సందర్భంగా తలెత్తిన తగాదా ఘర్షణకు దారితీసింది. మంగళవారం ఘర్షణలో పలువురు గాయపడ్డారు. కొల్లకుంట గ్రామంలో సోమవారం రాత్రి వినాయక లడ్డూ వేలం వేశారు. వేలంపాటలో టీడీపీ, జనసేన నాయకులు పార్టీ కండువాలు వేసుకుని, పాల్గొన్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శివశంకర్ రెడ్డి పార్టీ కండువాలతో పాల్గొనకూడదన్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. అక్కడే ఉన్న పోలీసులు సర్దిచెప్పారు. మంగళవారం మరోసారి శివశంకర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటి వద్ద దుర్భాషలాడుతుండగా అటుగా వెళ్తున్న టీడీపీ నాయకులు నవీన్, మంజు, మరికొందరు ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంలో వైసీపీకి చెందిన హనుమంతరెడ్డి, గోవిందరెడ్డి, వినూత్న, అలివేలమ్మ, యశోద, నాగభూషణ రెడ్డి, వెంకటలక్ష్మి, భాగ్యమ్మపై దాడి చేశారు. గాయపడిన వారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీ వర్గీయులు కూడా గాయపడ్డారు. వారు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఇరువర్గాలపై కేసు నమోదు చేయనున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు తెలిపారు.

పల్లెలపై కాసుల వర్షం

హిందూపురం, సెప్టెంబరు 10: దేశాభివృద్ధిలో కీలకమైన పల్లె సీమలను గత వైసీపీ పాలనలో నిర్వీర్యం చేశారు. సచివాలయ భవన నిర్మాణం చేపట్టి, అర్ధంతరంగా ఆపేసి, నాడు-నేడు పనులు అరకొరగా చేసి దిష్టిబొమ్మలా చేశారు. ఎక్కడా రోడ్డువేసిన, డ్రైనేజీ నిర్మించిన దాఖలాల్లేవు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం సంగతి దేవుడెరుగు, కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సంఘాలు, ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు పక్కదారి పట్టించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ మార్కు బెదిరింపులతో అధికచోట్ల వారే గెలిచారు. అయినా సర్పంచ్‌లకు రూపాయి కూడా ఇవ్వకుండా, అభివృద్ధి చేయకుండా వైసీపీ అధికారమే కోల్పోయింది. కేంద్రం నుంచి వచ్చిన నిధులు పక్కదారి పట్టించేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పల్లెలు అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. పల్లెలపై నిధుల వర్షం కురుస్తోంది.

గ్రామాలకు భారీగా నిధుల మంజూరు

పురం నియోజకవర్గానికి రూ.30 కోట్లు, పెనుకొండకు రూ.23.5 కోట్లు..

రోడ్ల నిర్మాణం, వసతుల కల్పనకు పెద్దపీట

పురం, పెనుకొండకు రూ.53.5కోట్లు

హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాలకు ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.53కోట్లు విడుదలైనట్లు జిల్లా కలెక్టర్.. సంబంధిత ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చారు. ఇందులో హిందూపురం నియోజకవర్గానికి రూ.30 కోట్లు, పెనుకొండకు రూ.23.5కోట్లు కేటాయించారు. హిందూపురం నియోజకవర్గంలో 197 పనులు చేపట్టనున్నారు.

హిందూపురం రూరల్ 83, లేపాక్షి 54, చిలమత్తూరు మండలంలో 58 పనులను గుర్తించి, నిధులు మంజూరు చేశారు. ఇందులో 30 కి.మీ. సీసీ రోడ్లు, 10కి.మీ. బీటీ రోడ్లు, 3కి.మీ. మేర డ్రైనేజీ ఏర్పాటు చేయనున్నారు. 60చోట్ల కల్వర్టులు నిర్మించనున్నారు. లింకురోడ్లకు మట్టితో చదును చేయనున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 305 పనులు చేపట్టనున్నారు. ఇందులో 41.5 కి.మీ. రోడ్లు వేయనున్నారు. సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, కొన్నిచోట్ల పాఠశాలల ప్రహరీలు నిర్మించనున్నారు.

వసతుల కల్పనకు శ్రీకారం

చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పల్లెలకు మహర్దశ పట్టుకుంది. సీఎం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఏరికోరి గ్రామీణాభివృద్ధి శాఖలు తీసుకున్నారు. పల్లెల అభివృద్ధిపై దృష్టిపెట్టారు. దీంతో పల్లెలకు పూర్వ వైభవం రానుందని అధికారులే పేర్కొంటున్నారు. ఉపాధిహామీ పథకం నిధులతో పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క సీసీ రోడ్డు వేసిన పాపాన పోలేదు. ప్రస్తుతం ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేయనున్నారు. పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం.


తారురోడ్డుగా మారనున్న తమ్మినాయనపల్లి రోడ్డు

పురానికి రూ.30 కోట్లు

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు రూ.90 కోట్లకుపైగా పనులు గుర్తించి, నివేదికలు తయారుచేసి ఉప ముఖ్యమంత్రికి పంపారు. రూ.30కోట్లు మొదటి విడత కింద మంజూరు చేశారు. మంజూరైన పనులు పూర్తయిన వెంటనే రూ.50కోట్లు మంజూరుకు ఉప ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎన్నికల సందర్భంగా చిలమత్తూరు మండలం తమ్మినాయనపల్లికి తారురోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా ఈ రోడ్డు అధ్వాన్నంగా ఉంది. పలుసార్లు తారు రోడ్డు వేయాలని గ్రామస్థులు పట్టుబట్టారు. గత వైసీపీ పాలనలో పలుమార్లు నిరసనలు చేసినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీమేరకు బీటీ రోడ్డు వేయనున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో మంజూరైన పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. బిల్లుల చెల్లింపులో ఆలస్యం ఉండదు. ఈ వారంలోపే పనులను ప్రారంభిస్తాం. ఇక పల్లెలకు మహర్దశ వచ్చినట్లే.

- మురళి, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ



ఖర్మాగారం

నేల, పంటలకు నష్టం కలిగిస్తున్న ఫ్యాక్టరీలు

- కాలుష్యంతో తగ్గుతున్న దిగుబడి
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- ఏటా అరకొర పరిహారమే చెల్లింపు
- న్యాయం కోసం
- నేమకల్లు అన్నదాతల వేడుకోలు



అనపకాయలు నల్లగా మారడంతో నీటిలో కడుగుతున్న రైతులు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఏర్పాటైన స్పాంజ్, ఐరన్ ఫ్యాక్టరీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కాలుష్యంతో పంటలు బూడిద రంగులోకి మారి ఎండిపోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భూమి కూడా పాడైపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. డీ.హీరేహాళ్, బొమ్మనహాళ్ పరిసర ప్రాంతాల్లో ఐదు స్పాంజ్, ఐరన్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి నుంచి వచ్చే దుమ్ము, ధూళి సమీపంలోని పంట పొలాలు, నేమకల్లు గ్రామంపై పడుతున్నాయి. దాదాపు 500 ఎకరాలకు పైగా భూమి కాలుష్యం అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. తీవ్ర కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రతి ఏటా పంటలు సాగుచేయడం కాలుష్యంతో పంటలు ఎండిపోవడం రివాజుగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా, కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు మాత్రం ఏడాదికి ఎకరానికి రూ. 1800 నుండి రూ. రెండు వేల వరకు అరకొరగా ఆర్థిక సాయమందించి మమ అనిపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

న్యాయం చేయాలి : క్రిష్ణయ్య, రైతు, నేమకల్లు



కాలుష్యం వల్ల పంటలు పండటం లేదు. పూర్తిగా పాడవుతున్నాయి. పంటలు బూడిద రంగులోకి మారి ఎండిపోతున్నాయి. దీంతో అప్పుల పాలయ్యాం. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా న్యాయం చేయడం లేదు. మొన్ననే కలెక్టరేట్ ముట్టడించాం. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం. కాలుష్యంతో రోగాల పాలవుతున్నాం.

పంటలు కోల్పోతున్నాం



కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు కోల్పోతున్నాం. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము, ధూళి పంటలపై పడి దిగుబడి రాకుండా పోతుంది. కాలుష్యం బారిన పడిన పంటను పశువులు కూడా తినడం లేదు. రైతులు, కూలీలు రోగాల బారిన పడుతున్నారు. పొలాలలో పనిచేయడానికి కూలీలు రావడం లేదు. అధికారులు పట్టించుకుని మాకు న్యాయం చేయాలి.

- హనుమంతరెడ్డి, రైతు, నేమకల్లు

రోగాలబారిన పడుతున్నాం



ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వల్ల రోగాల బారిన పడుతున్నాం. ఫ్యాక్టరీ పొగ గ్రామంలోకి రావడంతో దానిని పీల్చి దగ్గు, పడిశం ముందుగా వచ్చి ఆస్తమా వస్తోంది. పొలాలలో పనులు చేస్తున్న సమయంలో ఆ కాలుష్యంతో కాళ్లు మండుతున్నాయి. అధికారులు స్పందించి కాలుష్యం ఎక్కువగా రాకుండా చర్యలు తీసుకోవాలి.

- రామాంజి, రైతు, నేమకల్లు

15న పరీక్ష

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 10: ఉమ్మడి జిల్లాలో ఇటీవల విలేజ్ పశుసంవర్ధక సహాయకులుగా ఉద్యోగం పొందిన 451 మందికి ఈనెల 15న సామర్థ్య పరీక్ష ఉంటుందని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. 451 మందికి ప్రత్యేక శిక్షణ పూర్తయ్యిందన్నారు. వీరందరికి ఈనెల 15న అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సామర్థ్య పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే హాల్ టిక్కెట్లను సిబ్బందికి అందజేశామన్నారు.

కసాపురం హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ సొమ్మును లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది, వలంటీర్లు

గుంతకల్లు, సెప్టెంబరు10: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ. 58.81 లక్షల ఆదాయం లభించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఆలయంలో మంగళవారం ఉదయం హుండీలను తెరిచి అందులో భక్తులు వేసిన సొమ్మును లెక్కించారు. శ్రావణ మాస ఉత్సవాలు ముగిసిన వెంటనే అధికారులు హుండీల సొమ్మును లెక్కగట్టారు. ప్రధాన హుండీల ద్వారా రూ. 58,66,842లు, అన్నదానం హుండీ ద్వారా రూ. 14,882లు కలిపి రూ. 58,81,724లు లభించినట్లు అధికారులు తెలియజేశారు. 5 గ్రాముల బంగారం, 2 కిలోల వెండి, ఒక అమెరికన్ డాలర్ లభ్యమైనట్లు వివరించారు. శ్రావణ మాసానికి ముందు జూలై 30న హుండీల సొమ్మును లెక్కించారు. అప్పటి నుంచి సెప్టెంబరు 9 వరకూ 41 రోజులలో భక్తులు హుండీలలో వేసిన మొత్తాలను మంగళవారం లెక్కించినట్లు దేవస్థానం ఈఓ భద్రాజీ తెలియజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కే సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, సూపరింటెండెంటు పీ వెంకటేశులు, ట్రస్టుబోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


మసాజ్.. గంటకు 2 వేలు..!

- కియ వద్ద మసాజ్ సెంటర్ల ఏర్పాటు
- రెస్టారెంట్‌ల ముసుగులో నిర్వహణ
- మసాజ్ పేరిట గుట్టుగా వ్యభిచారం
- వైసీపీ హయాంలో ఏర్పాటు.. కొనసాగింపు



మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్న అపార్ట్‌మెంట్ ఇదే..

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 10: కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పనిచేసే కొరియా సిబ్బంది, ఇతర ఉద్యోగుల అవసరాల కోసం మార్ట్‌లు, రెస్టారెంట్లు ఏర్పాటయ్యాయి. స్థానికులు సైతం చిన్నా చితకా వ్యాపారాలతో ఉపాధి పొందుతున్నారు. అయితే కొందరు ఇదే అదనుగా అడ్డదారిలో సంపాదనకు దిగారు. రెస్టారెంట్ల ముసుగులో మసాజ్ సెంటర్లను ఏర్పాటు చేసి.. లోపల వ్యభిచారం కూడా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పెనుకొండలో రెండు, గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో సుమారు నాలుగు మసాజ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పాలసముద్రం వద్ద గుట్టుగా వ్యవహారం సాగుతోంది. కానీ, పెనుకొండ వద్ద ఏకంగా గంటకు రూ.2వేలు, గంటన్నరకైతే రూ.2500 అంటూ ధరలు, సమయం వివరాలతో పోస్టర్లు ఏర్పాటు చేసి మసాజ్ ప్రియులను ఆహ్వానిస్తున్నారు. టీడీపీ హయాంలో మసాజ్ సెంటర్లను ఏర్పాటు చేసినా.. ప్రభుత్వం వాటిని గుర్తించి రెండు నెలల వ్యవధిలోనే అరికట్టింది. నిర్వాహకులకు పోలీసులు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. కానీ, వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు మసాజ్ సెంటర్లను తెరిచారు. పోలీసులు కూడా మౌనం వహించడంతో దందా యథేచ్ఛగా సాగింది. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి.



ధరలు, సమయం తెలిపే పోస్టరు

ఆన్‌లైన్‌నే బుకింగ్

కియ సమీపంలో రెస్టారెంట్లు నిర్వహించే ప్రాంతాలను కొందరు మసాజ్ సెంటర్లకు అడ్డాలుగా మార్చుకున్నారు. కొరియన్లు, ఇతర రాష్ట్రాల వారికి మసాజ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. గంటకు రూ.2 వేలు, గంటన్నరకు రూ.2500 చొప్పున ధరలు నిర్ణయించారు. నాలుగు నెలల వ్యవధిలో ఏడు మసాజ్‌లు చేయించుకుంటే రూ.10 వేలు మాత్రమే అంటూ ఆఫర్లతో ఆకర్షిస్తున్నారు. ధరల వివరాలు తెలిసేలా మసాజ్ సెంటర్ల వద్ద పోస్టర్లు కూడా ఏర్పాటు చేశారు.

వేరే ప్రాంత మహిళలతో..

పెనుకొండ నియోజకవర్గంలో ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలతో మసాజ్ చేయిస్తున్నారు. పెనుకొండ డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఒకటి, జాతీయ రహదారి సమీపంలో కింగ్ మసాజ్ సెంటర్ పేరిట ఒకటి, పాలసముద్రం వద్ద పలుచోట్ల మసాజ్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఇక్కడ 'వ్యాపారం' జోరుగా సాగుతోందని సమాచారం. మసాజ్ సెంటర్లను నిర్వహిస్తే.. నిబంధనల మేరకు మహిళలకు మహిళలు, పురుషులకు పురుషులు మాత్రమే మసాజ్ చేయాలి. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా వ్యవహారం సాగుతోంది. పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు న్నాయి. దీనిపై పెనుగొండ సీఐ రాఘవన్‌ను స్పందిస్తూ.. ఇప్పటికే రెండు మసాజ్ సెంటర్ల నిర్వాహకులను పిలిపించి తీవ్రంగా హెచ్చరించామని చెప్పారు. నిబంధనల మేరకు మసాజ్ చేయాలని, అలాకాకుండా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా, మహిళలతో పురుషులకు మసాజ్ చేయించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించామని తెలిపారు.



మసాజ్ సెంటర్ లోపలి భాగం

క్రస్ట్ గేట్లను మార్చాల్సిందే..!

- డ్యాం భద్రతకు ఇదే పరిష్కారం
- 1,632 అడుగుల వరకే నీటిని నిల్వ చేయాలి
- స్టాప్‌లాగ్స్ ఏర్పాటుపై అధ్యయనం అవసరం
- 22వ గేటు వద్ద గుంత వల్ల డ్యాంకు ప్రమాదం
- తుంగభద్రపై నిపుణుల కమిటీ ప్రాథమిక అంచనా
- మూడు రోజుల్లో బోర్డుకు సమగ్ర నివేదిక



తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల జీవిత కాలం తీరిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయడం మంచిది కాదు. మరో క్రస్ట్ గేటు కొట్టుకుపోదని గ్యారెంటీ ఇవ్వలేం. కొత్తగా, అత్యాధునిక డిజైన్‌తో 33 క్రస్ట్‌గేట్లను ఏర్పాటు చేయడం ఉత్తమం' అని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నియమించిన ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డికి కమిటీ మంగళవారం ప్రాథమిక నివేదిక అందజేసింది. డ్యాం గేట్ల అధ్యయనంలో గుర్తించిన అంశాలతో సమగ్ర నివేదిక మూడు రోజుల్లో అందజేస్తామని కమిటీ ఛైర్మన్ ఏకే బజాజ్ బోర్డు అధికారులకు చెప్పినట్లు సమాచారం. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటుగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి తుంగభద్ర జలాశయం. స్వాతంత్ర్యం రాక ముందే 1945లో అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చేపట్టిన ఈ ప్రాజెక్టు 1953లో పూర్తయింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రాజెక్టుగా 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా మారింది. తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. మూడు రాష్ట్రాలకు 70 ఏళ్లుగా సాగు, తాగునీరు అందిస్తోంది. డ్యాం ప్రారంభం నుంచి క్రస్ట్‌గేట్లు సమస్య తలెత్తలేదు. తొలిసారిగా ఈ ఏడాది ఆగస్టు 10న 19వ నంబరు గేటు చైన్‌లింక్ తెగిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తక్షణమే ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు అప్రమత్తం కావడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌లను దిగ్విజయంగా అమర్చారు. వరద నీరు కడలిపాలు కాకుండా కాపాడగలిగారు. ఇదే సమయంలో డ్యాం భద్రతపై సందేహాలు తలెత్తాయి. టీబీపీ బోర్డు సూచన మేరకు ఎన్‌డీఎస్ఏ నియమించిన కమిటీ డ్యాంను పరిశీలించింది. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ ఏకే బజాజ్ ఛైర్మన్‌గా, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఢిల్లీకి చెందిన హర్కేశ్ కుమార్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆంధ్రప్రదేశ్ సీడీవో సీఈ నాగరాజు, తెలంగాణ రాష్ట్రం సీడీవో ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డు ఎస్ఈ సుధాకర్, కర్ణాటక రాష్ట్రం టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రిటైర్డు సెక్రటరీ సిద్దరంగప్ప సభ్యులుగా ఉన్న నిపుణుల కమిటీ సోమ, మంగళవారం రెండు రోజులు డ్యాంతో పాటు క్రస్ట్‌గేట్లను తనిఖీ చేసింది.

కీలక అంశాలతో నివేదిక

తుంగభద్ర డ్యాం 33 క్రస్ట్‌గేట్లు జీవితకాలం తీరడంతో వాటి స్థానంలో అత్యాధునిక డిజైన్‌తో కొత్తగేట్లు ఏర్పాటు చేయాలని ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ప్రధానంగా అభిప్రాయపడింది. గేట్ల నిర్వహణలో కీలకమైన హాయిస్ట్ మెకానిజం, రోప్స్ లేటెస్ట్ డిజైన్‌తో ఏర్పాటు గురించి నిపుణులతో అధ్యయనం చేయించాలి. మూడు రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాలు సంరక్షించే భారీ ప్రాజెక్టు కావడంతో జలాశయం పటిష్టతపై (డ్యాం హెల్త్ కండిషన్) పూర్తిస్థాయిలో సంబంధిత నిపుణులతో అధ్యయనం చేయించాలి. క్రస్ట్‌గేట్ల దిగువ భాగం దాదాపు 9 నెలలకు పైగానే నీటిలో ఉంటున్నందున.. వాటి అరుగుదలను కూడా పరిశీలించాల్సి ఉందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. గతంలో 1,632 అడుగుల లెవల్‌లో నీటిని నిల్వ చేసేవారు. ఆ తరువాత గరిష్ఠ లెవల్ 1,633 అడుగుల వరకు నీటి నిల్వ చేయడం వల్ల గేట్లపై ఒత్తిడి పెరిగింది. కాబట్టి.. ఇకపై 1,632 అడుగుల లెవల్‌లోనే నీటిని నిల్వ చేయాలని కమిటీ సూచించింది. గేట్లు కనీసం 2.5 అడుగులు ఎత్తాలని, ఒక అడుగు, అర అడుగు ఎత్తడం వల్ల నీటి ప్రవాహవేగం, ఒత్తిడికి గేట్ల దిగువన డ్యాం బయటి వైపు గుంతలు పడి డ్యాం పునాదులకే ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఇక నుంచి గేట్లు ఎత్తాల్సి వస్తే.. కనీసం 2.5 అడుగులు ఎత్తాలని సూచించారు. అలాగే ఈ డ్యాంకు స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ లేవు. దీంతో సాంకేతిక సమస్యలతో ఏదైనా గేటు కొట్టుకుపోతే క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల వరకు డ్యాం ఖాళీ చేయాల్సి వస్తుంది. ఈ సమస్య తలెత్తకుండా థర్డ్‌పార్టీ నిపుణులతో స్టాప్‌లాగ్ ఏర్పాటుపై అధ్యయనం చేయించి, వారు ఇచ్చే నివేదిక మేరకు ముందుకు వెళ్లాలి. ఇలా పలు సూచనలతో ఏకే బజాజ్ నాయకత్వంలోని నిపుణుల కమిటీ టీబీపీ బోర్డు అధికారులకు ప్రాథమిక నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

ఆ గుంత వల్ల డ్యాంకు ప్రమాదం

శ్రీశైలం ప్రాజెక్టుకు ప్లంజ్‌పూల్ వల్ల ఎలాంటి ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారో.. అదే తరహాలో తుంగభద్ర డ్యాంకు కూడా ఓ భారీ గుంత(పూల్) వల్ల ప్రమాదం పొంచి ఉందని నిపుణులు గుర్తించారు. డ్యాం బయట వైపున 22వ నంబరు గేటు దిగువన 40 అడుగుల లోతు, 60 అడుగుల వెడల్పుతో భారీ గుంత ఏర్పడింది. దీని వల్ల డ్యాం పునాదులకు ప్రమాదం పొంచి ఉందని గతంలోనే నిపుణులు పలుమార్లు హెచ్చరించారు. డ్యాం లెఫ్ట్ బ్యాంక్ (మునిరాబాద్ వైపు) ఆనకట్టకు 100 మీటర్ల దూరంలో పార్కులో బోటింగ్ కోసం సరస్సు ఏర్పాటు చేశారు. ఈ సరస్సులోకి నీరు మళ్లించేందుకు లెఫ్ట్ కెనాల్‌కు తూములు కూడా ఏర్పాటు చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. అయితే ఈ సరస్సులోకి డ్యాం నుంచి లీకేజీ అవుతోందని, దీని వల్ల కూడా ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ రెండింటి పూడ్చివేత కోసం బోర్డు ఇంజనీర్లు డ్యాం రిహ్యాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్) కింద కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మంజూరు కాలేదు. ఈ గుంతల వల్ల డ్యాంకు ప్రమాదం ఉన్న మాట నిజమే అయినా తాము ప్రస్తుతం క్రస్ట్‌గేట్లు, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీపైనే అధ్యయనం చేసి నివేదిక ఇస్తామని నిపుణుల కమిటీ చెప్పినట్లు తెలిసింది.

చీనీ టన్ను రూ.20 వేలు



అనంతపురం రూరల్, సెప్టెంబరు 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలు పలికాయన్నారు.

ఎద్దు దాడి.. రైతు మృతి



మృతి చెందిన రైతు హనుమంతప్ప

డి.హీరేహాళ్, సెప్టెంబరు 10: మండలంలోని హడగలి గ్రామానికి చెందిన రైతు ఎద్దు తొక్కడంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన రైతు హనుమంతప్ప(70), భార్య గంగమ్మ ఇతర కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఎద్దులను తీసుకుని పొలం పనికి వెళ్లాడు. సాయంత్రం పొలం గట్టుపై మేత మేస్తున్న ఎద్దు బెదిరిపోయి పక్కనున్న హనుమంతప్పపై దాడి చేసింది. కొమ్ములతో గుద్ది కాళ్లతో తొక్కి తీవ్రంగా గాయపరిచింది. కుటుంబసభ్యులు హనుమంతప్పను చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వ విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు.

ఎప్పుడూ ఇంతే..!

- బదిలీలపై గందరగోళం.. పాత స్థానాల కోసం పట్టు
- సిఫారసు లేఖల కోసం ఉద్యోగుల పాట్లు
- ముడుపుల కోసం అడ్డదారులు
- డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు బదిలీల్లో ఆరోపణలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 10: జిల్లాలో కీలకంగా ఉన్న డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు శాఖల్లో ఉద్యోగులు బదిలీల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదివరకు పనిచేసిన మండలాలకే తిరిగి వెళ్లాలని కొందరు ఉద్యోగులు సిఫారసు లేఖలు, ముడుపులు ఇచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం డ్వామాలో హెచ్‌ఆర్ విభాగంలో ఏకంగా కౌంటర్ ఓపెన్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు, ఉద్యోగులే ప్రస్తుతం హెచ్‌ఆర్ విభాగంలో కొనసాగుతున్నారు. దీంతో వారు బదిలీల కోసం సమర్పించుకోవాలని చెప్పకనే చెబుతున్నట్లు సమాచారం. ఉద్యోగులు కూడా తమకు నచ్చిన స్థానం దొరికితే చాలు సమర్పించుకుందాం అన్న ఆలోచనలో ఉన్నారు. గతంలో పనిచేసిన మండలాలకే తిరిగి బదిలీ కావాలంటే ఇచ్చుకోకతప్పదని హెచ్‌ఆర్ విభాగానికి కొంతమేర ముడుపులు ముట్టజెప్పినట్లు సమాచారం. ఇక డీఆర్‌డీఏ-వెలుగులో ఇదివరకు వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన పీడీ కోరుకున్నచోటకు బదిలీ చేసేందుకు సుమారు రూ.2లక్షల నుంచి వసూళ్లు చేసినట్లు గతంలోనే విమర్శలు వచ్చాయి. ఈ విషయాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' బహిరంగపరచడంతో ఆ పీడీ ఒక అడుగు వెనక్కు వేసి సాధారణ బదిలీల్లో న్యాయం చేస్తామని ఉద్యోగులను ఊరడించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ పీడీ లేకపోవడంతో ముడుపులు సమర్పించుకున్న ఉద్యోగులు ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో పడ్డారు.

నిబంధనల మేరకే..:

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే ఉద్యోగుల బదిలీలు చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి, జిల్లా కలెక్టర్ సూచనలు పరిగణలోకి తీసుకుని ఉద్యోగుల బదిలీలు చేస్తున్నాం. ఐదేళ్లు పూర్తి అయిన ఉద్యోగులు తప్పకుండా కదలాలి. ఇక బదిలీలకు సంబంధించి ఏ ఉద్యోగి ఎవరికి ఎటువంటి సొమ్ము ఇవ్వరాదు, అటువంటి అపోహలను ఎవరూ నమ్మొద్దు. పూర్తి పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలను చేపడుతున్నాం. ఇందులో ఎటువంటి సందేహం అవసరం లేదు.

- వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ



ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ

బదిలీల నేపథ్యంలో ఉద్యోగులు సిఫారసుల లేఖ కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదివరకు పనిచేసిన మండలాలకే మళ్లీ పోస్టింగ్ కావాలని కొందరు డీఆర్‌డీఏ-వెలుగు, డ్వామా ఉద్యోగులు పట్టుపడు తున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో కీలక స్థానాల్లో పనిచేసిన ఉద్యోగులకే తిరిగి కూటమి ప్రభుత్వంలోనూ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో ప్రాధాన్యం కలిగిన స్థానాలను సాధించుకున్న ఉద్యోగులే ప్రస్తుతం అదే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలోని ప్రజాప్రతినిధుల చుట్టూ డ్వామా, డీఆర్‌డీఏ ఉద్యోగులు సిఫారసుల లేఖల కోసం తిరుగుతున్నారు.



డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయం

డీఆర్‌డీఏలో బదిలీలకు కమిటీ

డీఆర్‌డీఏ-వెలుగులో ఉద్యోగుల బదిలీలకు కమిటీ నియమించారు. పీడీ ఓబుళమ్మ, ఏపీడీ ఈశ్వరయ్య, హెచ్‌ఆర్ ఏపీఎం శ్రీనివాసులు, డీపీఎం ఫైనాన్స్ మజ్జిగ సత్యనారాయణ, శ్రీసత్యసాయి జిల్లా పీడీ నరసయ్య, డీపీఎం ఫైనాన్స్ పీడీ, రామిరెడ్డి, లైవ్‌లీ హుడ్స్ డీపీఎం రామ్మోహన్‌లు కమిటీలో ఉన్నారు. ఇప్పటికే టీటీడీసీలో కమిటీ ఇటీవల సమావేశం నిర్వహించి బదిలీలపై చర్చించారు. ఇదివరకు పనిచేసిన మండలాలకు తిరిగి పోస్టింగ్ ఇవ్వరాదని నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో పనిచేసిన పీడీ కొందరు ఉద్యోగులతో రూ.2లక్షల వరకు తీసుకుని బదిలీలు చేశారని, ఆ బదిలీలను నిలిపివేయాలని ఉద్యోగులు పట్టుపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం చివరిలో ఇలా అప్పటి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, ముడుపులు పుచ్చుకుని కోరుకున్నచోటకు బదిలీ చేశారనే విమర్శలు ఉన్నాయి. డీఆర్‌డీఏ-వెలుగులో ఏపీడీ, డీపీఎం, ఏసీ, ఏపీఎంలు, సీఓల స్థాయిలో ఉద్యోగులు బదిలీల కోసం యత్నిస్తున్నారు.

గతంలో పని చేసిన మండలాలే కావాలని పట్టు

డ్వామా ఉద్యోగుల బదిలీల్లో గందరగోళంగా ఉంది. బదిలీల కోసం వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు సమాచారం. ఉద్యోగుల బదిలీల్లో కీలకంగా ఉన్న హెచ్‌ఆర్ విభాగం కేంద్రంగా ఈ ముడుపుల బాగోతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు హెచ్‌ఆర్ విభాగంలో అనేక అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉద్యోగుల ద్వారా రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. గత నెల 31 వరకు ఉన్న బదిలీలకు చివరి గడువును ఈనెల 15దాకా పొడిగించారు. దీంతో ఉద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ బాగోతాన్ని కొందరు ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు చేరవేసినట్లు సమాచారం. గత నెలలో 8 మంది ఏపీఓలను బదిలీ చేయగా కంబదూరులో ఏపీఓ సుజాత ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. గతంలో పనిచేసిన బుక్కరాయసముద్రం మండలమే తనకు కావాలని పట్టుపడుతున్నట్లు సమాచారం. ఇలా డ్వామాలో పలువురు ఉద్యోగులు తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి అన్ని దారులను వెతుక్కుంటున్నారు. అయితే ఇందులో ముడుపులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆశాఖలో చర్చించుకుంటున్నారు. డ్వామాలో ప్రధానంగా ఏపీడీ, ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీల్లో ముడుపులకు తెరలేపుతున్నట్లు ఆశాఖలో ఉద్యోగులే చెబుతున్నారు.



● ఓబుళదేవరచెరువులో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్యలు



● నంబులపూలకుంటలో కొన్ని వినాయక విగ్రహాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. బక్కిరెడ్డిపల్లిలో వినాయకుడి లడ్డూను రూ.66 వేలు, చాకలి బజారులోని వినాయకుడి లడ్డూను రూ.28 వేలకు భక్తులు వేలం పాటలో దక్కించుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తనకల్లు, సెప్టెంబరు 10: మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అమడగూరు మండలం ఇద్దేవాండ్లపల్లికి చెందిన లక్ష్మీదేవి (42) మంగళవారం మరణించారు. వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని చూడటానికి సీజీ ప్రాజెక్టు వద్ద సోమవారం రాత్రి తన భర్త, పిల్లలతో కలిసి బైక్‌లో వెళ్లారు. తిరిగి వస్తుండగా.. వెనక నుంచి బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడింది. తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కదిరికి, అక్కడి నుంచి అనంతపురానికి తరలించారు. అనంతపురంలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆమె మరణించింది. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తనకల్లు, సెప్టెంబరు 10: మండలంలోని రాకుంటపల్లి రోడ్డులో మంగళవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. అమడగూరు మండలం గువ్వలపల్లికి చెందిన అమృత, తన స్కూటీలో తనకల్లు మండలంలోని ఈఆర్ పల్లి గ్రామానికి బయలుదేరింది. మండలంలోని ఉప్పువాండ్లపల్లికి చెందిన మహేశ్వర్‌రెడ్డి, నర్సిరెడ్డి ద్విచక్రవాహనంలో అమడగూరు వైపు బయలుదేరారు. రాకుంటపల్లి రోడ్డు సమీపంలో ఎదురెదురుగా ఈ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. వారిని 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి

తనకల్లు, సెప్టెంబరు 10: మండలంలోని బొంతలపల్లి గ్రామ సర్వేనెంబర్ 183-ఏలోని 4.28 ఎకరాల్లో పేదలు వేసుకున్న షెడ్లను రెవెన్యూ అధికారులు తొలగించడం అన్యాయమని సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బొంతలపల్లి గ్రామ సర్వేనెంబర్ 181, 182, 184, 185, బాలసముద్రం గ్రామ సర్వేనెంబన్ 121లో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా పట్టించుకోని అధికారులు.. పేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం వెంటనే స్పందించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో వెంటనే న్యాయం చేయాలని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రెడ్డెప్ప, రైతుసంఘం చౌడప్ప, మహమ్మద్, ఆనంద్‌కుమార్, రవి, రాణి, పలువురు లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపట్నుంచి క్రీడా పోటీలు

గాండ్లపెంట, సెప్టెంబరు 10: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గురు, శుక్రవారాల్లో మండలంలోని అన్ని ప్రభుత్వం, ప్రైవేటు, కస్తూర్బా పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి మంగళవారం తెలిపారు. అండర్ 14, 17 బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహిస్తామని, కోకో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, యోగా, చెస్.. తదితర ఏడు రకాల క్రీడాపోటీలు ఉంటాయన్నారు.

జాబ్‌మేళాలో 42 మందికి ఉద్యోగాలు

బుక్కపట్నం, సెప్టెంబరు 10: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. దాదాపు 96 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 42 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్‌ఖైయుం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మగ్బుల్ హుస్సేన్ పాల్గొన్నారు.

14న జిల్లా స్థాయి క్రీడాపోటీలు

ధర్మవరం, సెప్టెంబరు 10: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 14న కదిరి పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ధర్మవరం యూటీఎఫ్ మహిళా నాయకురాళ్లతో కలిసి ఆయన ఆ క్రీడాపోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

వైసీపీ అక్రమాలు కనిపించవా?

- బత్తలపల్లి పోలీసుల తీరుపై టీడీపీ నాయకుల ఆగ్రహం
- రాత్రంతా స్టేషన్ ఆవరణలో ధర్నా
- డీఎస్పీ జోక్యంతో శాంతించిన వైనం



బత్తలపల్లి స్టేషన్ ఎదుట అర్ధరాత్రి ధర్నా నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి, సెప్టెంబరు 10 : 'వైసీపీ నాయకులు అక్రమంగా ఇసుక, మట్టి తోలుతున్నా వారి వాహనాలను పట్టుకొని వదిలేస్తున్నారు. అయితే టీడీపీ వాళ్లవి అయితే సొంత పూచికత్తుపై కూడా వదలడం లేదు. కనీసం కోర్టుకు కూడా అప్పగించడం లేదు. జూన్ 27న బత్తలపల్లికి చెందిన ఓ వైసీపీ నాయకుడు అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు పత్రికల్లో కథనాలు వచ్చినా ఎందుకు పట్టించుకోవడం లేదు. వైసీపీ వాళ్లకు ఒక న్యాయం... ఇతరులకు మరో న్యాయమా..' అని టీడీపీ నాయకులు స్థానిక పోలీసులను నిలదీశారు. మండలంలోని చిత్రావతి నది నుంచి 15 రోజుల క్రితం ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్, మూడు జేసీబీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే గతంలో పట్టుకున్న ఆరు ట్రాక్టర్లను వైసీపీ నాయకుల సొంత పూచికత్తుపై పోలీసులు వదిలేశారు. టీడీపీ వాళ్లకు చెందిన ట్రాక్టర్లను, జేసీబీలను సొంత పూచికత్తుపై వదల్లేదు. కనీసం కోర్టుకైన పెట్టాలని పలుమార్లు టీడీపీ నాయకులు స్టేషన్ చుట్టూ తిరిగారు. అయినా పోలీసులు ఆ వాహనాలను వదల్లేదు. ఎన్నిసార్లు వేడుకున్నా వాహనాలను వదలకపోవడంతో ఆగ్రహించిన టీడీపీ నాయకుడు విశ్వనాథ్ తన అనుచరులతో కలిసి సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున వరకు స్టేషన్ ఆవరణంలోనే నిరసనకు దిగారు. పోలీసులు ఎంత చెప్పినా ఆయన నిరసన విరమించలేదు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు బత్తలపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఏదైనా సమస్యఉంటే తన దృష్టికి తీసుకురావాలే కానీ ఇలా స్టేషన్ వద్ద నిరసన చేయరాదని సూచించారు. వైసీపీ నాయకులకు ఇక్కడి పోలీసులు అండగా ఉంటున్నారని, వారు అక్రమంగా ఇసుక, మట్టి తోలుతున్నా వారి వాహనాలను వదిలేస్తున్నారని విశ్వనాథ్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ధర్మవరంలోని తన కార్యాలయానికి రావాలని డీఎస్పీ సూచించడంతో ఆయన నిరసనను విరమించుకున్నారు.

కూటమి సేవలు ఆదర్శప్రాయం: ఎమ్మెల్యే



నల్లమాడలో టీడీపీ నాయకులు సేకరించిన బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 10: విజయవాడలో వరద బాధితులకు ముఖ్యమంత్రితో పాటు కూటమి మంత్రులు, నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు అక్కడే ఉండి అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. మండలంలోని ఉట్లవారిపల్లిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడు 75 ఏళ్ల వయసులోనూ వరద ప్రాంతాల్లో పర్యటించి, బాధితులను ఆదుకొంటున్నారని, ఆయన్ను ఆదర్శంగా తీసుకొని అనేకమంది వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకు వస్తున్నారని అన్నారు. తన వంతు సాయంగా నియోజకవర్గం నుంచి వెయ్యి క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు, ముఖ్యమంత్రికి త్వరలో అందచేస్తామన్నారు. వారి వెంట మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, పీట్ల సుధాకర్, ఉంట్ల మహేశ్వర్‌రెడ్డి, కుర్లి శివారెడ్డి, జౌలి బాబా, బోరు రమణ, శ్రీనివాసరెడ్డి, కుర్లి గంగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నిజాం, ఆంజనప్ప ఉన్నారు.

నల్లమాడ : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో భాగంగా టీడీపీ మండల కన్వీనర్ శివశంకర్ ఆధ్వర్యంలో నాయకులు వంద క్వింటాళ్ల బియ్యం, దుస్తులు, సరుకులు సేకరించారు. నల్లమాడలో వాటిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. అలాగే చౌటకుంటపల్లిలో టీడీపీ నాయకులు పది బస్తాల బియ్యాన్ని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్‌రెడ్డి, రామచంద్ర, బుట్టి నాగభూషణం నాయుడు, సలాంఖాన్, గన్‌రెడ్డి, శివారెడ్డి, కేశవరెడ్డి, చందనబాబు, గోరేసాబ్, నాగరాజు, దస్తగిరి వలీ, వేణుగోపాల్, బాబావలీ, రహీమాన్, తోసీఫ్, డీలర్లు నాగరాజు, శంకర్, సలీం బాషా, మధుసూదన్‌రెడ్డి వెలుగు రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ సర్పంచ్

కదిరి, (అమడగూరు): మండలంలో లోకోజుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అమడగూరు వైసీపీ సర్పంచ్ షబ్బీర్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



ధర్మవరం, కదిరి ఆర్‌అండ్‌బీ బంగ్లాలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

ధర్మవరం, సెప్టెంబరు 10: తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక షిర్డీసాయిబాబా గుడి వెనుక గల గంగమ్మ గుడి వద్ద ఆమె చిత్రపటానికి మంగళవారం పలువురు నివాళులర్పించారు. ఇందులో టీడీపీ బీసీ విభాగం రజక సాధికార సమితి జిల్లా కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకులేటి నరసింహులు, గంగమ్మగుడి అధ్యక్షుడు కృష్ణాపురం మస్తానప్ప, సంఘం నాయకులు మాల్యవంతం వెంకటేశులు, గొట్లూరు రామకృష్ణ, కొత్తకోట రామాంజి, గంగరాజు, వెంకటరాముడు, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్: మండలంలోని గొట్లూరు గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఇందులో జిల్లా రజక అభివృద్ధి సంస్థ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అగ్రహారం ముత్యాలు, సంస్థ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పోలుగల్లు కమ్మన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ పార్వతి, పట్టణ అధ్యక్షులు న్యామద్దల నరసింహులు, శ్రీరాములు, శేఖర్, రామాంజి, ఆదెప్ప, గంగాధర్, పద్మావతి, శాంతమ్మ, సుజాత పాల్గొన్నారు.

కదిరి : తలుపులలో కుమ్మరపేట దోబీఘాట్ వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు జీవీ రమణ, జిల్లా నాయకుడు నారాయణ, ఉపాధ్యక్షులు కురమ్మరపేట రవి, నాగేంద్ర, పురుషోత్తం, రామప్రసాద్, రాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో చాకలి ఐలమ్మ వర్ధంతిని బీసీ ఉద్యోగుల సంఘం, రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అలాగే రజక సంఘం ఆధ్వర్యంలో దోబీఘాట్ వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రామచంద్రయాదవ్, నాగరాజు, సాయి శీనా, నరసింహ, శంకర్, ఎ. శంకర్, శ్రీనివాసులు, రామమోహన్, ఎర్రగుడ్డి రామాంజనేయులు, రజక సంఘం గంగన్న, శివశంకర్, లలితమ్మ, గంగరాజు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా...



చెక్కును అందజేస్తున్న జింకా

ధర్మవరం, సెప్టెంబరు 10 : వరద బాధితుల సహాయార్థం కోసం ధర్మవరం పట్టణానికి చెందిన జీఆర్ సిల్క్ శారీస్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జింకా రామాంజినేయులు రూ. 15 లక్షలు విరాళంగా అందజేశారు. ఆ చెక్‌ను విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడికి మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో మంగళవారం అందజేశారు.

● వివేకానంద విద్యార్థులు..



ధర్మవరంలో చెక్కు అందజేస్తున్న వివేకానంద విద్యార్థులు

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో భాగంగా స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. వచ్చిన రూ.6,326 మొత్తాన్ని చెక్కు రూపంలో ప్రిన్సిపల్‌కు మంగళవారం అందజేశారు. దీన్ని సీఎం సహాయ నిధికి పంపుతామని ఆయన తెలిపారు.

● బీసీ సంక్షేమ సంఘం...



ధర్మవరంలో బియ్యం సేకరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బీసీ సంక్షేమ సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య ఆధ్వర్యంలో మేడాపురం, నామాల, ధర్మవరంలో 500 ప్యాకెట్ల బియ్యాన్ని సేకరించారు. ఈ బియ్యాన్ని బుధవారం విజయవాడలో బాధితులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బండివెంకటేశు, కార్యదర్శి బయన్న, కోశాధికారి కొండయ్య, సహాయ కార్యదర్శి తిరుపాలు, ఉపాధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

● బీజేపీ కదిరి నేత ఆధ్వర్యంలో...



విజయవాడలో బాధితులకు బీజేపీ నాయకుల సాయం

కదిరి అర్బన్: విజయవాడలో వరద బాధితులకు కదిరి బీజేపీ నాయకుడు పెన్నబడి అమరనాథ్‌రెడ్డి రూ. 60 వేల విలువైన దుప్పట్లు, పంచలు, చీరలను మంగళవారం పంపిణీ చేశారు. మంత్రి మధుకర్, నాయకుల ఆధ్వర్యంలో ఆయన వాటిని బాధితులకు అందజేశారు.

● ముదిగుబ్బ వాసి ఔదార్యం...



విజయవాడలో సరుకులతో ముదిగుబ్బ వాసులు

ముదిగుబ్బ: స్థానిక వెల్డింగ్ షాప్ యజమాని రమేష్ బాబు విజయవాడలోని వరద బాధితులకు రూ. 2.50 లక్షల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ముదిగుబ్బ నుంచి ఐచర్ వాహనంలో నిత్యావసర సరుకులు తీసుకువెళ్లి బాధితులకు మంగళవారం పంపిణీ చేశారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

ముగ్గురికి గాయాలు - 25 మందిపై కేసు

తాడిమర్రి, సెప్టెంబరు 10: మండలంలోని తురకవారిపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనం నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఓ వర్గానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం సాయంత్రం వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలో తమ పార్టీ పాటలు పెట్టాలంటూ ఇరు వర్గాల వారు గొడవపడ్డారు. అయితే గొడవ సద్దుమునిగి నిమజ్జనం ప్రశాంతంగానే ముగిసింది. రాత్రి 11.30 గంటల సమయంలో అందరు నిద్రపోతున్న వేళ ఒక వర్గం వారు మరో వర్గంవారిపై దాడి చేసి ముగ్గురిని గాయపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావుతో పాటు తాడిమర్రి, బత్తలపల్లి, పట్నం ఎస్ఐలు తురకవారిపల్లి గ్రామానికి చేరుకుని 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన గణేశ్, తేజ, బాలాజీను ప్రథమ చికిత్స చేయించి అదుపులోనే ఉంచుకున్నారు. తిరిగి మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు చర్చలు జరిపారు. అనంతరం ఇరువర్గాల్లోని 25 మందిపై కేసు నమోదు చేసుకొని.. బైండోవర్ చేసినట్టు ఎస్ఐ నాగాస్వామి తెలిపారు. కాగా, దాడిలో గాయపడిన వారిపై.. దాడి చేసిన వారిపై ఒకే రకమైన కేసు నమోదు చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో పాట్లు..!

- సమస్యలతో గ్రామీణుల ఇక్కట్లు
- ఏళ్లు గడిచినా పట్టించుకోని పాలకులు
- ప్రభుత్వాలు మారుతున్నా.. బాగుపడని పల్లెలు
- వీధుల్లోనే మురుగునీటి నిల్వ
- రోడ్ల పరిస్థితి మరీ ఘోరం

నల్లమాడ, సెప్టెంబరు 10: ప్రభుత్వాలు మారుతున్నా.. పల్లెల బాగోగులు ఏ మాత్రం మారడం లేదు. దశాబ్దాల తరబడి అవే సమస్యలతో గ్రామీణులు జీవనం సాగిస్తున్నా రు. ఎన్నికల సమయంలో ఇంటింటికి వచ్చి ఓట్లు అడిగిన నాయకులు.. గెలిచిన తర్వాత ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదు. మండలంలోనే పెద్ద పంచాయతీ నల్లమాడ. ఈ పంచాయతీలో మొత్తం 16 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలన్నింటిలోనూ ఏళ్ల తరబడి అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఏ పార్టీకి చెందిన నాయకులూ ఈ సమస్యల గురించి పట్టించుకోలేదు. ప్రధానంగా మురుగు కాలువలు, రోడ్లు సరిగా లేకపోవడంతో గ్రామీణులు పడరాని పాట్లు పడుతున్నారు. నల్లమాడ ఎస్సీ కాలనీ అంతా మురుగునీరే. దుర్వాసనతో దోమలకు నిలయంగా మారింది. సత్యమ్మ సర్కిల్ నుంచి కుమ్మరివీధి, పాతమసీదు, బురువీధుల మీదుగా ఎప్పుడు మురుగునీరు రోడ్లపైనే పారుతూ ఉంటుంది. బైక్‌దారులు అదుపు తప్పి.. కిందపడటంతో కాళ్లు.. చేతులు విరిగిన సంఘటనలు అనేకం. ఎస్సీ కాలనీలో మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి విజ్ఞప్తి చేస్తున్నా... పట్టించుకునేవారే కరువయ్యారు. పెద్దకోట్ల గ్రామంలో సిమెంటు రోడ్లు లేక గ్రామం అంతా గుంతలయమంగా మారింది. ద్విచక్రవాహనంలో వెళ్లాలన్నా కష్టమే. పెద్దకోట్లలో తాగునీటి సమస్య ఉంది. గ్రామస్థులు గ్రామ శివారుల్లోని బోరు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. కొండ్రవారిపల్లి గ్రామం ఏర్పడినప్పటి నుంచి సిమెంటు రోడ్లు వేసిన దాఖలాలు లేవు. పాలకులు మారుతున్నా... ఏ పార్టీ నాయకుడూ ఈ గ్రామంలో ఒక అడుగు కూడా సిమెంటు రోడ్డు వేసినా పాపాన పోలేదు. ఆర్డీటీ కాలనీ, కొండ్రవారిపల్లిలో మురుగునీటి కాలువలు లేక రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. బాసంవారిపల్లి గ్రామం సగం ఎత్తులో..సగం తగ్గులో ఉంది. దీంతో ఎత్తులో ఉన్న వారికి తాగునీరు సరఫరా కావడం లేదు. అరవవాండ్లపల్లి, ఎద్దులవాండ్లపల్లి, ఎద్దులవాండ్లపల్లి తండా, అప్పయ్యగారిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు, మురుగు కాలువలు లేవు. చెరువువాండ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల నుంచి నల్లమాడకు వెళ్లేదారి పూర్తిగా శిథిలమైంది. నల్లమాడ నుంచి సోముగుట్టపల్లి, కొండ్రవారిపల్లి, కుటాలపల్లికి వెళ్లే తార్ రోడ్డు కూడా గుంతలయంగా ఉంది. పలు గ్రామాల్లో వీధి దీపాలు కూడా అరకొరగానే ఉన్నాయి.

ఊరంతా గుంతలే



మాది పెద్దకోట్లపల్లి . మా గ్రామం పుట్టినప్పటి నుంచి సిమెంటు రోడ్లు వేసిన పాపాన పోలేదు. గ్రామ శివారులో ఓ బోరుంది. ఆ బోరు నుంచి నీళ్లు తక్కువగా వస్తున్నాయి. గ్రామంలోకి ఆ నీరు రాకుండా పోవడంతో ఊరంతా మంచినీటి కోసం ఆ బోరువద్దకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామంలో కొత్త బోరు వేస్తే నీటి సమస్య తగ్గుతుంది.

- హనుమంతరెడ్డి, పెద్దకోట్లపల్లి



నల్లమాడ ఎస్సీ కాలనీ వీధుల్లో పారుతున్న మురుగు నీరు



చెరువువాండ్లపల్లి రోడ్డు దుస్థితి

అందుబాటులో ప్రత్యామ్నాయ విత్తనాలు

నంబులపూలకుంట, సెప్టెంబరు 10: మండలంలోని రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఉలవలు సాగుచేసే రైతులు ఆయా రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 80 శాతం రాయితీతో 10 కేజీల బస్తాకు రూ.174ను రైతులు చెల్లించాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు 95 శాతం పూర్తి అయిందని, ఈనెల 15లోపు ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. 9,500 ఎకరాల్లో పంట నమోదు చేశామని, పంట నమోదు చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలని సూచించారు.

విత్తనాల పంపిణీ

బత్తలపల్లి: స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు ప్రత్యాన్నాయ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఓ ఓబిరెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లాలో సకాలంలో వర్షాలు రాకపోవడంతో వేరుశనగ సాగు చేసేందుకు వీలుకాదన్నారు. రైతులు ప్రత్యాన్మాయ పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యాన్మాయ విత్తనాలను సబ్సిడీతో అందిస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పురం..దొంగల భయం..!

● పెరుగుతున్న బైక్ చోరీలు ● పార్క్ చేస్తే బండి మాయం ● నెలలోనే 15 వాహనాల అపహరణ



హిందూపురం, సెప్టెంబరు 10 : పురంలో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఎక్కడైనా బండి ఆపాలంటే జనం బెంబేలెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల రోజుల క్రితం లేపాక్షి మండలానికి చెందిన ఓ వ్యక్తి పట్టణంలోని శ్రీనివాసటాకీస్ రోడ్డులో ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి ఆసుపత్రిలోకి వెళ్లాడు. బయటికి వచ్చి చూసేసరికి బండి మాయం అయింది. స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే మూడునాలుగు రోజులు తిప్పుకోవడంతో యజమాని మిన్నకుండిపోయాడు. అదేనెలలో రైల్వే స్టేషన్ రోడ్డులో పట్టణానికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి అరగంట తరువాత వచ్చి చూసేసరికి వాహనం మాయమైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెంగళూరు రోడ్డులో పరిగికి చెందిన ఓ వ్యక్తి బ్యాంక్‌లోకి వెళ్లి పని ముగించుకుని వచ్చి చూసేసరికి బండి లేదు. చుట్టుపక్కల గాలించి ఆఖరికి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరు మాత్రమేకాదు ఇలాంటి వారు పట్టణంలో బాధితులు చాలా మంది ఉన్నారు.

పక్కా ప్లాన్‌తోనే..

పురం ప్రాంతంలో నమోదవుతున్న వాహనాల చోరీలు. అత్యధికంగా పట్టణంలో ద్విచక్రవాహనాలు పార్క్‌చేసిన ప్రాంతాల్లో ఎత్తుకెళ్తున్నారు. కొంత కాలంగా స్కూటీతో మొదలుకుని ఖరీదైన వాహనాలు ఎత్తుకెళ్తున్నారు. ఆదమరిస్తే ఏమార్చుచేస్తారు. రెప్పపాటులో ద్విచక్రవాహనాలు మాయం చేస్తారు. వారంలో మూడు నాలుగు వాహనాలు మాయం అవుతున్నాయి. ఇందులో కొన్ని ఫిర్యాదులు పోలీసు రికార్డుల్లోకి ఎక్కలేదు.

మొదట రెక్కీ.. ఆపై అపహరణ

ద్విచక్రవాహన యజమానులు ఎక్కడైనా తమ వాహనాలు నిలిపి తమ పనులు ముగించుకుని నిమిషాల వ్యవధిలోనే వెనక్కు వస్తున్నా అప్పటికే వాహనాలు చోరీకి గురవుతున్నాయి. దొంగలు ఇద్దరు ముగ్గురు రద్దీగా ఉండే కూడళ్లలో మొదట మాటు వేస్తారు. ద్విచక్రవాహనదారుడు దుకాణంలోకి లేదా వేరే పనికి వెళ్తే అతన్ని ఒకరు అనుసరించి మరొకరు ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్తారు. అయితే వాహన యజమాని కదలికలను తెలియజేస్తూ పట్టణం దాటేస్తున్నారు. చాలా వాహనాలు రద్దీ ప్రదేశంలోనే మాయమవుతున్నాయి.

పార్కింగ్ స్థలం కరువు

హిందూపురం పట్టణంలో వందల సంఖ్యలో వివిధరకాల దుకాణాలున్నాయి. కానీ ఏ దుకాణం ముందు వాహనాలు పార్క్ చేయడానికి స్థలం లేదు. ఉన్నస్థలమంతా భవనాలు నిర్మించుకున్నారు. ఎక్కడా వాహనాలు నిలపడానికి స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే పార్క్‌చేస్తారు. దీంతో పని కోసం అక్కడే ఆపి దుకాణాల్లోకి వెళ్లి వచ్చేసరికి బండ్లు మాయం అవుతున్నాయి. ముఖ్యంగా భవనాలు, దుకాణాలున్న యజమానులు సెల్లార్ నిర్మించుకుని ఉంటే వాహనాల చోరీలు తగ్గేవని పోలీసులు అంటున్నారు. ఒకవేళ ఉన్నాకానీ వారి సొంత వాహనాలకే తప్ప ఆసుపత్రికి వచ్చే రోగులు, వారికి సంబంధించిన వాహనాలకు అనుమతి ఇవ్వరు. దీంతో వాహనం పార్క్‌చేసి వెళ్లిన వారు ఆలస్యంగా వస్తారని గమనించిన దొంగలు సునాయాసంగా ఎత్తుకెళ్తున్నారు.

యువకులే అధికం

పట్టణంలో ద్విచక్రవాహనాల చోరీల కేసుల్లో పట్టుబడినవారిలో అధికంగా యువకులే ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. దీనినిబట్టి యువత చెడు వ్యసనాలకు బానిసై సునాయాసంగా డబ్బు సంపాదించే మార్గాన్ని ఎంచుకుని, దొంగతనాలకు అలవాటుపడినట్లు గత కేసుల్లో పట్టుబడినప్పుడు విచారణలో వెల్లడైంది.

దొంగలకు కలిసొస్తున్న సరిహద్దు

పురం ప్రాంతం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు సరిహద్దులో ఉండడంతో దొంగతనాలకు సులువుగా మారింది. హిందూపురంలో చోరీ చేసిన వాహనాలను పక్క రాష్ట్రంలో విక్రయించడం, కర్ణాటకలో చోరీ చేసిన వాహనాలను ఆంధ్రలో విక్రయించడం దొంగలకు అలవాటుగా మారింది. దీంతో దొంగలకు ఈ సరిహద్దు ప్రాంతం బాగా కలిసొస్తోంది.

నెలలోనే 15 వాహనాలు..

గత జూలై మాసంలో హిందూపురం పట్టణంతోపాటు పరిగి, లేపాక్షి, చిలమత్తూరు ప్రాంతాల్లో 15ద్విచక్రవాహనాలు చోరీ అయినట్లు తెలుస్తోంది. ఇందులో కొన్ని వాహనాల యజమానులు మాత్రమే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతమంది రికార్డులు పోగొట్టుకోవడంతో సొంత వాహనమైనా పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయారు. ముఖ్యంగా హిందూపురం పట్టణంలో బెంగళూరు రోడ్డు, పేటవీధి, పెనుకొండ రోడ్డు, రైల్వే రోడ్డు, శ్రీనివాసటాకీస్ రోడ్డు ఏరియాల్లో ద్విచక్రవాహనాలు చోరీలు అధికంగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు ద్విచక్రవాహన దొంగలను పట్టుకుని అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

త్వరలో పనుల ప్రారంభం: మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 10 : పెనుకొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు బీసీ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సవిత పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 41.5కి.మి. రోడ్డుకు రూ.23.31కోట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయన్నారు. పెనుకొండ మండలంలో 40 పనులకుగాను రూ.4.15కోట్లు, పరిగి మండలంలో రూ.4కోట్లకు 9కి.మీ, రోడ్డు, సోమందేపల్లిలో రూ.4.37కోట్లతో 8.41కిలోమీటర్లు, గోరంట్లలో రూ.5.44కోట్లతో 10.67కిమీ రోడ్డు, రొద్దం రూ.5.35కోట్లతో 7.72కి.మీ, రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రొద్దం-కందుకూర్లపల్లి మధ్య రహదారిలేక 25ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నారని, రూ.1.25కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. పెనుకొండ మండలం మరువపల్లి రోడ్డు, చిన్నపరెడ్డిపల్లి కల్వర్టు, పలు పాఠశాలల కాంపౌండ్ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

అవార్డులతో పెరగనున్న బాధ్యత

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో గుండుమల

మడకశిరటౌన్, సెప్టెంబరు 10: అవార్డు అందుకున్న ఉపాధ్యాయులకు బాధ్యత మరింత పెరిగినట్లేనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని, సామాజిక స్పృహతో సమాజంలో నిర్మాణాత్మకమైన పాత్ర ఉపాధ్యాయులదేనన్నారు. అవార్డు గ్రహీతలైన ప్రకాష్‌రెడ్డి, నరేంద్ర, సుజాత, శివప్రసాద్, రవికుమార్‌ను ఆయన సన్మానించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 10: పట్టణ పరిధిలోని దండు రోడ్డు ఎస్‌పీఆర్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్(అండర్15) సెటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే 200 మంది క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకు పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రంతోపాటు బహుమతులు అందజేస్తామన్నారు. అదే విధంగా వచ్చే నెలలో హర్యాణాలో జరిగే దేశవ్యాప్త పోటీలకు 15 మంది ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. అక్కడ ప్రతిభ కనబరిన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. కమిటీ సభ్యులు వెంకటేష్, దాదాకలందర్, షేక్షావలి, సీనియర్ క్రీడాకారులు జెమినీ నాగరాజు, శ్రీధర్, జెమినీ నవీన్ పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ సమస్య పరిష్కరించాలని వినతి

గోరంట్ల, సెప్టెంబరు 10: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోఏఎన్‌ఎంలకు వ్యాక్సినేషన్ సమస్య పరిష్కరించాలని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందచేశారు. స్థానిక పీహెచ్‌సీలో వ్యాక్సిన్ నిల్వ చేసే యంత్రం మరమ్మత్తులకు గురికావడంతో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండాపరం పీహెచ్‌సీకి వెళ్లి వ్యాక్సిన్ తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై శేఖర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రెడ్డిచెరువుపల్లి, వడిగేపల్లి, పాలసముద్రం, బూదిలి, మందపల్లి, నారసింహపల్లి ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కమనీయం.. గణనాథుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితుడు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 10: పట్టణ పరిధిలోని నానెప్ప నగర్‌లో వల్లభ గణపతి సేవాసమితి ఆధ్వర్యంలో గణనాథుని కల్యాణ వేడుకలు కమనీయంగా జరిగాయి. సోమవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవాలు నిర్వంచారు. వేడుకలు తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. డీఎస్పీ మహేష్, వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తదితరు హాజరయ్యారు. అనంతరం దేవతా మూర్తులను ద్వవంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వినాయకుడి అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 10: స్థానిక శ్రీకృష్ణదేవరాయల వైజంక్షన్‌వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండంతో పోలీసులు, టీడీపీ నాయకులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మంగళవారం వైజంక్షన్ వద్ద సీఐ రాఘవన్, టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్‌రావు.. జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. వారు మాట్లాడుతూ.. ఈ మార్గంలో వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు పాల్గొన్నారు.



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు, పోలీసులు

వరద బాధితులను ఆదుకుందాం

● 'గుప్పెడు దానం' పేరుతో బీజేపీ నాయకుల ప్రచారం




ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 10: విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు అందరూ కదిలిరావాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పెనుకొండ పట్టణంలో విస్తృతంగా ప్రతి వ్యక్తి గుప్పెడు దానం చేయాలని బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, గోపీనాథ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పట్టణ పురవీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ప్రజలు తమకు తోచిన సాయాన్ని వరద బాధితులకు అందించాలని వారు కోరారు. ప్రకృతి విపత్తు నుంచి బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలని వారు పిలుపునిచ్చారు. వారంరోజులపాటు జరిగే కార్యక్రమంలో అందరూ కదిలిరావాలన్నారు. ర్యాలీలో డా.గోపీనాథ్, రామక్రిష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్



కిట్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

మడకశిర రూరల్, సెప్టెంబరు 10: పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా పశుగణాభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ సూచించారు. మండలంలోని ఎల్లోటి గ్రామంలో మంగళవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాడి రైతుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సమావేశంలో డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పాడి పశువుల అభివృద్ధికోసం ఉచిత గర్భకోశ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే పాడి పశువులను ఆరోగ్యంగా చూసుకుని, అధికాదాయం పొందవచ్చన్నారు. అనంతరం పాడి రైతులకు గర్భకోశ వ్యాధి నివారణ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ గంగమ్మ నాగరాజు,మడకశిర ఏడీ డాక్టర్ అమర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

64 మంది రక్తదానం

గోరంట్ల, సెప్టెంబరు 10: పట్టణంలోని అన్నం రామక్రిష్ణయ్య వీధిలో గరుడా గణేష్ యూత్ అసోషియేషన్ మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి టీడీపీ నాయకులు నిమ్మల యువశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని శిబిరాన్ని ప్రారంభించారు. మండపం వద్దే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వాహనం ద్వారా 64మందియువత రక్తదానం చేశారు. గరుడా గణేష్ యువకులు గిరీష్, వెంకటసాయి, జయవర్ధన్, పవన్‌కుమార్, యశ్వంత్; సాయిచరణ్, జయ, ఇంద్రా తదితరులున్నారు. బిజెపీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ గోరంట్లలోని పలు వినాయక మండపాల వద్ద పూజల్లో పాల్గొని, రాజీవ్‌కాలనీలోని అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు నిమ్మల యువశేఖర్

ఇందిరమ్మ కాలనీలో భూదందా

● యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారని బాధితుల ఆవేదన



ఇందిరమ్మ కాలనీ

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 10: కాంగ్రెస్ హయాంలో 279సర్వే నెంబర్‌లో ఇందిరమ్మ కాలనీలో భూదందా సాగుతోంది. కాలనీకి అవసరమైన పాఠశాల, దేవాలయాలు, పార్కు, రోడ్డుకోసం వదిలిన స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో పలువురు వైసీపీ నాయకులు ప్రభుత్వ స్థలాలతో పాటు వంకలు, వాగులు కబ్జా చేశారు. కర్ణాటక, ఇతర మండల, తాలూకావాసులకు ఆ స్థలాలను రూ.లక్షల్లో అమ్మేసుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని మొర పెట్టుకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వైసీపీ నాయకులకే వత్తాసు పలికారు. కబ్జాదారులు మాత్రం ఒక్కొక్కరు నాలుగైదు స్థలాలు కాజేసి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా రీ సర్వే చేయించి ఇళ్లు లేని పేదలకు స్థలాలు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

మా స్థలాన్ని కబ్జా చేశారు: లోకేష్



మాకు 279సర్వే నెంబర్‌లో 49ప్లాట్ కేటాయించారు. నంబరుకు ప్రభుత్వ స్కెచ్ ప్రకారం వదిలిన రహదారిని కొందరు నాయకులు ఆక్రమించుకుని పునాదులు నిర్మించాలని ప్రయత్నించారు. తహసీల్దార్‌ను సంప్రదించి నిర్మాణాన్ని ఆపేయాలని వినతిపత్రం అందజేశాం.

స్థలం కోసం కాళ్లరిగేలా తిరిగాం: అంజినప్ప



గత 15ఏళ్లుగా స్థానికంగానే ఉంటున్నాం. ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నా. ఐదుగురు పిల్లలతో కష్టపడుతున్నా. రెవెన్యూ అధికారులకు పలుమార్లు వినతిపత్రం అందించా..అయినా స్పందించడం లేదు.

అక్రమంగా కేటాయించారు : మున్నా జియావుల్లా



గుర్తింపు పొందిన ఆధారం లేకుండా కర్ణాట ప్రాంతవాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. ఏ జీఓ ప్రకారం ఇంటి స్థలాలు మంజూరు చేశారో విచారించి చర్యలు తీసుకోవాలి. పేదలకు న్యాయం చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది.



ముళ్ల కంచెలో ఇరుక్కున్న ఎలుగు బంటిని కాపాడుతున్న మరో ఎలుగు బంటి

ఎలుగుబంటి స్నేహ హస్తం

మడకశిర, సెప్టెంబరు 10: ఒక తోటలోకి రెండు ఎలుగుబంట్లు వచ్చాయి. అందులో ఒకటి తోటకు వేసిన ఇనుప కంచెలో ఇరుక్కుపోయింది. బయటకు రావడానికి నానా అవస్థలు పడింది. దీన్ని గమనించిన మరో ఎలుగుబంటి.. స్నేహ హస్తాన్ని అందించింది. సుమారు అరగంట పాటు శ్రమించి ఇనుప కంచెలో ఇరుక్కున్న ఎలుగుబంటిని విడిపించింది. ఆ తరువాత రెండూ కలిసి అటవీ ప్రాంతం వైపు పరుగులు పెట్టాయి. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కర్ణాటక-ఏపీ సరిహద్దు ప్రాంతంలోని ఓ తోటలో ఇది జరిగిందని అటవీశాఖ తెలిపింది.

అంబేడ్కర్ రాజ్యాంగంతోనే ఎమ్మెల్యే పదవి

పావగడ, సెప్టెంబరు 10: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంతోనే ఎమ్మెల్యే పదవి దక్కిందని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం సికెపుర, కన్నవేడి, దొమ్మితిమర్రి గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా జేజేఎం పైప్‌లైన్ పనులు వేగవంతం చేసి ఇంటింటికీ తాగునీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామ పంచాయతీ అధ్యక్షులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ఎమ్మెల్యే రూ.2లక్షల విరాళం

● సీఎం చంద్రబాబునాయుడుకు అందజేత



సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, సెప్టెంబరు 10: ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే ఎంఎస్. రాజు రూ.2లక్షల చెక్కును అందజేశారు. మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కలిశారు. సీఎం చంద్రబాబు పిలుపుతో ఎమ్మెల్యే స్పందించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే విజయవాడ 55వ డివిజన్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం తరఫున సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

గోరంట్ల, సెప్టెంబరు 10: పట్టణంలోని కదిరి రహదారిలో ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాల వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకున్న సంఘటనలో హరీష్, రమేష్‌నాయక్ మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. గోరంట్ల మండలంలోని ముత్తరాయునితండాకు చెందిన రమేష్‌నాయక్ బెంగుళూరులో సెక్యూరిటీ ఉద్యోగిగా పనిచేస్తూ, వినాయక చవితి పండుగకు స్వగ్రామానికి వచ్చారు. వెంకటరమణ పల్లి గ్రామానికి చెందిన హరీష్ గోరంట్ల సమీపంలో పౌల్ట్రీ ఫంలో పనిచేస్తూ, విధులు ముగించుకుని ఇంటికెళ్తుండగా ప్రమాదం జరిగింది. రమేష్ నాయక్ మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ గోరట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

మొక్కజొన్న పంట ధ్వంసం



ధ్వంసమైన పంట

హిందూపురం (పరిగి), సెప్టెంబరు 10: కర్ణాటక సరిహద్దు ప్రాంతం కోనాపురం సమీపంలో తిరుమలేష్ అనే రైతుకు సంబంధించి ఎకరా మొక్కజొన్న పొలాన్ని కొందరు తాగుబోతులు ధ్వంసం చేశారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో మొక్కజొన్న పంటను ధ్వంసం చేసినట్లు బాధిత రైతు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తరచూ పొలాల్లో తాగుబోతులు రచ్చ చేస్తున్నట్లు ఆయన వాపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. వారిని గుర్తించి కేసు నమోదుచేస్తామని ఏఎస్‌ఐ జయలలిత తెలిపారు.

14న జిల్లా స్థాయి క్రీడాపోటీలు

ధర్మవరం, సెప్టెంబరు 10 : యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 14న కదిరి పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు

అగళి, సెప్టెంబరు 10: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11, 12తేదీల్లో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మోడల్ పాఠశాల పీడీ నారాయణస్వామి తెలిపారు. ప్రభుత్వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్14, అండర్17 బాల బాలికల వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహి స్తామన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

మారెమ్మకు హారతుల ఉత్సవం

గుడిబండ, సెప్టెంబరు 10: మండలంలోని కాళికెర, శంకరగల్లు, ఎస్.రాయాపురం, తదితర గ్రామాల్లో మంగళవారం గౌడ చంద్ర మారెమ్మ అమ్మవారికి హారతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు భక్తులు.. అమ్మవారిని దర్శించుకున్నారు.

1300 క్వింటాళ్ళ విత్తనాలు కేటాయింపు

మడకశిర,సెప్టెంబరు 10: ఖరీఫ్‌లో వర్షాబావ పరిస్థితుల కారణంగా వేరుశనగ పంట సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు 1300 క్వింటాళ్ళ ఉలవ విత్తనాలు కేటాయించినారని వ్యవసాయ శాఖ ఏడీ కృష్ణమీనన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు వీలుగా 80శాతం సబ్సిడీతో ఉలవ విత్తనాలు అందజేస్తామన్నారు. మడకశిర మండలానికి 300 క్వింటాళ్ళు, అమరాపురం మండాలనికి 400 కింట్వాళ్ళు, గుడిబండ మండలానికి 300 క్వింటాళ్ళు, రొళ్ళ మండలానికి 90 క్వింటాళ్లు అగళి మండాలనికి 210 క్వింటాళ్ళ ఉలవ విత్తనాల ను కేటాయించారన్నారు. 10కేజీల ఉలవ విత్తనాల ఫాకెట్ పూర్తి ధర రూ. 870 అందులో 80శాతం సబ్సీడి రూ.696లు పోను రైతు రూ.174 చెల్లించాల్సి ఉందన్నారు. ఈనెల 13 నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి: ఎంపీడీఓ

అగళి, సెప్టెంబరు 10 : మండలంలోని ప్రతి గ్రామంలో వీధిలైట్లు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు ఎంపీడీఓ రవి ప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాలపై నిర్లక్ష్యం వహించరాదని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ కార్యక్రమంకు అన్ని కులాలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీలో చేరేందుకు రేపటి వరకు గడువు

గోరంట్ల, సెప్టెంబరు 10: పట్టణంలోని ఎస్‌పీఎం డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం డిగ్రీలో చేరడానికి బుధవారంతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ భక్తవత్సం తెలిపారు. రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్, అగ్రికల్చర్, హార్టికల్చర్, డిప్లమా ఉత్తీర్ణులైనవారు డిగ్రీలో చేరవచ్చన్నారు. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ కోర్సుల్లో చేరడానికి అవకాశముందన్నారు. అర్హులైనవారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

లేపాక్షి, సెప్టెంబరు 10: ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం పులమతి పంచాయతీ నడ్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పులమతి గ్రామానికి చెందిన శ్రావణి(24) మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతిచెందింది. భర్త హరి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విషయం తెలియగానే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు.